# పోటెత్తిన అల

గండ్రకోట సూర్యనారాయణ శర్మ ...
96669 03960

ఆ గురువారం ఖద్దరు బట్టలు వేసుకుని, నల్ల కళ్లద్దాలు సవరించుకుంటూ వచ్చిన ఓబులేసు, దూరంగా నిలబడి తననే తదేకంగా చూస్తున్న ఏడుకొండలుని చూసి..

''అరే ఏడుకొండలూ! మై జిగిరీ దోస్త్! ఏంటింకా అట్లా దూరంగానే ఉన్నావ్? రా రా'' అంటూ దగ్గరికి పిలిచాడు.

అతణ్ని చూసిన ఆనందంలో ఏడుకొండలు కళ్లవెంట నీరు ధారాపాతంగా కారిపోసాగింది. అది చూసి..

''ఏమిట్రా పిచ్చోడా? ఎందుకీ కన్నీళ్లు?'' అంటూ ఆత్మీయంగా కౌగిలించుకున్నాడు ఓబులేసు.

ఆరోజు అతణ్ని తమ ఇంట్లో భోజనానికి రమ్మని పిలిచాడు ఏడుకొండలు. రాకరాక తమ ఇంటికి వచ్చిన అతణ్ని లక్ష్మి సాదరంగా ఆహ్వానించింది.

భోజనాలయ్యాక ఓబులేసు లక్ష్మితో..

''వీడు నా ప్రాణస్నేహితుడు. ప్రేమాభిమానాలు కురిపించడంలో నువ్వుకూడా వాడికి తగ్గ భార్యవని పించుకున్నావు. నువ్వు చేసిన రొయ్యల ఇగురు నాకెంతో ఇష్టం. నిజంగా ఇట్లాంటి భోజనం చేసి ఎన్నాళ్లయిందో! మీ ఇద్దరికీ చాలాచాలా థాంక్స్'' అన్నాడు.

''గదేందన్నా అట్లంటవ్. నీ అసుంటి గొప్పోడు మా ఇంటికి వొచ్చుడే ఎక్కువ. ఇది మా అదురుట్టం'' అని లక్ష్మి అనడంతో అతను నవ్వేశాడు.

తర్వాత ఏడుకొండల్ని చూస్తూ..

''సర్లే! నీ గురించి చెప్పు. ఎట్లా ఉంది నీ పని? వేట లాభసాటిగా ఉందా?'' అనడిగాడు.

''ఎందుకుండదు? ఆ సముద్దరాన్ని నమ్ముకున్నాను. ఆ తల్లే ఇంత కూడు బెడుతున్నది. నా సంగతి సరే.. నువ్వు బొంబై బోయి ఎన్ని తిప్పలు వడ్డవో ఏమో తెల్వదు గానీ, మొత్తానికి గొప్ప యాపారయేత్తవైనావని అందరూ సెప్పుకొంటుంటే ఇన్నాను. శానా సంతోసం ఏసినాది'' అన్నాడు.

''ఈ బిజినెసుల్లో ఎన్ని తలనొప్పులో నీకేందెల్సు. సర్లే.. ఈ గొడవ ఎప్పుడూ ఉండేదే! అట్లా బీచికి వెళ్లి కాసేపు కబుర్లు చెప్పుకొందాం పద'' అంటూ అతణ్ని బయల్దేరదీశాడు.

లక్ష్మికి వీడ్కోలు చెప్పి ఏడుకొండలుతో కలిసి ఓబులేసు వెళ్లేసరికి, బీచ్ చాలా సందడిగా ఉంది. ఇద్దరూ వాళ్లు చిన్నతనంలో ఆడుకునే చోటుకే వెళ్లి కూర్చున్నారు.

కొద్దిసేపు ఆ మాటా ఈమాటా మాట్లాడుకున్న తర్వాత..

''ఒరే! నీ పడవ తియ్యరా. సముద్రం మీదికి వెళ్లి చాలా రోజులైంది'' అన్నాడు ఓబులేసు.

అతనలా అడగడం ఆలస్యం.. ఏడుకొండలు వెంటనే అతణ్ని తన పడవ దగ్గరికి తీసుకెళ్లాడు. సముద్రం చిన్న చిన్న అలలతో నవ్వుతూ ఆ స్నేహితులిద్దరినీ ఆహ్వానించింది. అలా వాళ్లు మాటల్లోపడి తీరం నుంచి కాస్త దూరంగానే వెళ్లారు. ఆ సమయంలో ఉన్నట్లుండి అక్కడి వాతావరణంలో ఏదో మార్పు వచ్చింది.

* * *

రక్తంతోనూ, సముద్రపు నీళ్లతోనూ తడిసిపోయి ఉన్న ఓబులేసు శరీరాన్ని ఏడుకొండలు భుజంపైన వేసుకుని రావడం చూసిన గూడెం జనం.. ''ఏటయినాది...'' అంటూ అతని చుట్టూ గుమిగూడారు.

